'వంద కాదు, వెయ్యి కాదు. వెధవది రెండున్నర. అిదుకు అంత అబద్ధం ఆడాలా? అడిగితే ఇవ్వనూ? చూస్తే చదూకున్న వాడిలా ఉన్నాడు. ఇదేం బుద్ధి?'
వంద మార్లైనా ఆ ముక్క అనుకుని ఉంటాడు రాజారాం.

సరిగ్గా వారం రోజుల క్రితం జరిగిన సంఘటన మరో సారి మదిలో మెదిలింది.

# సమయస్ఫూర్తి

— మూరి వెంకటరావు

కూతుర్నీ, అల్లుణ్నీ చూడాలని విశాఖ పట్నం బయలుదేరాడు రాజారాం. ఆ రోజు బస్సులో ప్రయాణికు లంతగా లేరు. కదిలి పోతున్న తరుల్నీ, గిరుల్నీ చూస్తూ ప్రయాణించడ మంటే రాజారాం



కెంతో ఇష్టం.అందుకే కిటికీ దగ్గర కూర్చున్న అబ్బాయిని ముందుకు రమ్మని చెప్పి ఆ సీట్లో అడ్జస్టు అయిపోయాడు. అతడికి ఇరవై ఏళ్ల కంటే ఎక్కువ ఉండవు. సన్నగా, పొడవుగా ఉన్నాడు. జీన్స్ ప్యాంటు, తెల్లని చొక్కా వేసుకున్నాడు. చేతిలో ఏదో ఫైలుంది.

కండక్టరు దగ్గరకు రాగానే "విశాఖ పట్నానికి ఒక టిక్కె ట్టివ్వండి" అన్నాడు రాజారాం, పర్సు తెరిచి పది కాగితం తీసిచ్చి.

చిల్లర లే నట్లుంది. ముఖం అదోలా పెట్టి పక్కన కూర్చున్న జీన్స్ ప్యాంటు అబ్బాయి వంక చూశాడు కండక్టరు.

"వైజాగ్‌కు ఒక టిక్కట్టు." ఆ అబ్బాయి కూడా పది రూపాయల కాగితమే ఇచ్చాడు.

కండక్టరు ఇద్దరికీ చెరో టిక్కె ట్టిచ్చి కుర్రాడి చేతిలో ఐదు రూపాయల కాగితం పెడుతూ, "దిగగానే మార్చి ఈయనకు రెండున్నర ఇవ్వండి' ' అని చెప్పి, ముందుకు సాగి పోయాడు, మిగిలిన వాళ్లకు టిక్కె ట్లివ్వడం కోసం.

చిల్లర సమస్య తలెత్తి నప్పుడు ఇద్దరేసి ప్రయాణికులకు డబ్బులు ముడి పెడుతూ ఉంటారు కండక్టర్లు.

కండక్ట రిచ్చిన ఐదు రూపాయల కాగితాన్ని భద్రంగా జేబులో కుక్కుకుంటూ "విశాఖ పట్నంలో మీరెక్కడకు వెళ్లాలి?" అడిగాడు ఆ అబ్బాయి నవ్వు ముఖం పెట్టి.

చిరునామా చెప్పాడు రాజారాం.

మరి వారి మధ్య మాటలు లేవు.

గంట తర్వాత గమ్య స్థానం చేరింది బస్సు.

జీన్స్ ప్యాంటు అబ్బాయి బస్సు దిగి వడి వడిగా ముందుకు నడిచాడు.

చిల్లర మార్చేందుకు దుకాణాని కెళుతున్నా డనుకుని అతన్ని అనుసరించాడు రాజారాం.

అయితే ఆ ధ్యాస అతనిలో ఉన్నట్లు కనిపించక పోవడంతో, "ఏయ్ అబ్బాయ్!" బిగ్గరగా కేక పెట్టాడు.

ఆగాడు జీన్స్ ప్యాం టబ్బాయి.

"నా రెండున్నర..?"

రాజారాం మాటలకు ప్రశ్నార్థకంగా ముఖం పెట్టాడు ఆ కుర్రాడు.

"అదేనయ్యా, బస్సులో కండక్టరు నా కిమ్మన్న ..."

"డబ్బులా? ఎవరి కివ్వాలో ఏమిటో సరిగ్గా గుర్తుకు తెచ్చుకోండి."

అప్పటికే రాజారాం దిగిన బస్సు వెళ్లి పోయింది. అక్కడున్న వాళ్లంతా అతని వంక వింతగా చూస్తున్నారు. జీన్స్ ప్యాం టబ్బాయి తనకు రెండున్నర ఇవ్వాలని గట్టిగా చెప్పేందు కు తన వద్ద ఆధారాలు లేవు. అందుకే మనసు మండి పోతున్నా మారు మాట్లాడకుండా వెళ్లి పోయాడు రాజారాం.

00 00 00

గేటు తీసుకుని లోపలికి వస్తున్న అబ్బాయిని చూశాడు రాజారాం.

ఆశ్చర్యం!

ఆ కుర్రాడే!

సందేహం లేదు.

ఆ రోజు తనకు రెండున్నర ఎగనామం పెట్టి ఉడాయించిన అబ్బాయి!

చేతులు జోడించాడు వచ్చిన వ్యక్తి.

అతని వందనాన్ని అందుకోడానికి రాజారాం మనస్సు అంగీకరించడం లేదు. ఎందు కొచ్చా వన్నట్లు చిరాగ్గా చూశాడు.

"ఆ రోజు మిమ్మల్ని బుకాయించి రెండున్నర తీసుకెళ్లి నందుకు క్షమాపణ చెప్పుకుందా మని."

మాట్లాడ లేదు రాజారాం. భగభగ మండే బడబాగ్నిని చిటికెడు నీళ్లు చల్లార్చ లేవు కదా!

"నాటి నా అవసరం నన్నంత హీన స్థితికి దిగజార్చింది. పదకొండు గంటలకు ఇంటర్వ్యూ కు హాజరవ వలసిన నేను పదీ యాభై నిముషాలకు విశాఖలో అడుగు పెట్టాను. సిటీ బస్సు కోసం నిరీక్షిస్తే పన్నెం డై పోవడం ఖాయం. ఇంటర్వ్యూకే పంక్చువాలిటీ పాటించ లేక పోతే, నన్ను మిలిటరీ వాళ్లెలా రిక్రూట్ చేసుకుంటా రు? టైము విషయంలో అర్హత కోల్పోయిన వాడి నవుతానేమో నన్న బెదురుతో ఆటోలో వెళ్లాలని నిర్ణయించుకున్నాను. నా దగ్గరున్న డబ్బుకు ఈ రెండున్నరా కలిపితే తప్ప ఆటోలో వెళ్ల లేని పరిస్థితి. అందుకే అలా చేయ వలసి వచ్చింది. నేను ఇంటర్వ్యూలో సెలె క్టయ్యాను. పోస్టింగ్ ఆర్డరు కూడా వచ్చింది. నా ఉన్నతికి మీరే కారకులు. పరోక్షంగా మీరు చేసిన ఉపకారం ఈ జన్మకు మరిచి పోలేను. మీ ఆశీర్వాదం కోసం వచ్చాను" డబ్బు, స్వీటు ప్యాకెట్టు బల్ల మీద పెడుతూ, రాజారాం పాదా న్ని స్పృశించాడు ఆ అబ్బాయి.

తన రెండున్నర ఒక పేద వాడి ఉజ్వల భవిష్యత్తుకు ఉపకరించిందని తెలియగానే ఎంతగానో సంతోషించాడు రాజారాం. ఈ తరం యువతలోని సమయస్ఫూర్తిని లోలోన మెచ్చుకున్నాడు. అంత వరకు ప్రజ్వరిల్లుతున్న హృదయాగ్ని చప్పున చల్లారి పోయింది.




